
సాక్షి
ఒడిశా
సోమవారం । 10 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.7,16,851
బంగారం	3 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
వెండి	210 గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



భక్తిశ్రద్ధలతో బోల్‌భం దీక్షలు

- 8లో



ట్రక్కు దొంగతనం

● ఇద్దరు నిందితులు అరెస్టు

- 8లో

న్యూస్‌రీల్

అమ్మో..!



వినోదం, ఆహ్లాదం కోసం బారంగ్ నందన కానన్ జూ సందర్శించిన పర్యాటకులకు విచిత్రమైన అనుభవం ఎదురైంది. సందర్శనలో భాగంగా యంత్రాంగం ఏర్పాటు చేసిన వాహనంలో జంగిల్ సఫారీకి సుమారు 30 మంది బృందంగా బయల్దేరారు. అయితే సింహాలు, పులులు, ఎలుగు బంటి వంటి వన్య మృగాలు విచ్చలవిడిగా సంచరించే ప్రాంతంలో సందర్శకుల వాహనం మొరాయించడంతో ప్రాణాలు పోయినంత పనయ్యింది. ఎటూ కదలలేని పరిస్థితుల్లో ఇరుక్కుంది. ఇంతలో అక్కడే సంచరిస్తున్న మృగరాజులు ఈ వాహనాన్ని చుట్టుముట్టాయి. దీంతో ఒక గంట పైబడి సందర్శకులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని బయటపడ్డారు. నందన కానన్ అధికార వర్గాలు మరో వాహనం ఏర్పాటు చేసి ఘటనా స్థలానికి చేరారు. సందర్శకులను చుట్టు ముట్టిన సింహాలను ఆహారం మిషతో పక్కదారి పట్టించి, ప్రమాదం నుంచి బయటపడేలా చేసి సందర్శకులను సురక్షితంగా తీసుకుని రాగలిగారు. ఈ సంఘటనపై విచారణ జరిపేందుకు ఏఎఫ్‌వోకు ఆదేశించినట్లు నందన కానన్ డైరెక్టరు తెలిపారు.

- భువనేశ్వర్

సీఎంకు కృతజ్ఞతలు



సమావేశంలో పాల్గొన్న బీజేడీ నాయకులు

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి కె.సీతాపురం గ్రామానికి చారిత్రాత్మక రాధాకాంత మందిరం అభివృద్ధికి సీఎం నవీన్ పట్నాయక్ రూ.20 లక్షల మంజూరు చేసినందుకు ఆ పార్టీ నాయకుడు తిరుపతి పాణిగ్రాహి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కె.సీతాపురం గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయిక్, 5టీ కార్యదర్శి పాండియన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు, కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల శాయమ్మ, బీజేడీ బ్లాక్ ప్రెసిడెంట్ అఖిల పాత్రో, బీజేడీ రాష్ట్ర కార్యదర్శి బసంత్ దాస్, సర్పంచ్ కె.తేజేశ్వరరావు, రూపేష్ పాణిగ్రాహి, సుమంత్ చింతాడ తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి'



ఈశ్వర్ పాణిగ్రాహికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

కొరాపుట్: జిల్లాలో పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దామని బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శిగా ఇటీవల నియామకమైన ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి పిలుపునిచ్చారు. స్థానిక స్కిల్ డవలప్‌మెంట్ సమావేశంలో బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శిగా నియామకమైన ఆయనను కార్యకర్తలు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి అధిక సమయం కేటాయించలేకపోతుండడం వలన జిల్లా అధ్యక్ష పదవిని వదులుకోవాల్సి వచ్చిందన్నారు. తనను జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని గత 2 నెలలుగా పార్టీ అధిష్టానానికి కోరుతునట్లు పేర్కొన్నారు. తొలుత పార్టీ కొరాపుట్ జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చారన్నారు. అనంతరం నబరంగ్‌పూర్ జిల్లాకి పార్టీ పరిశీలకునిగా అప్పగించారని, దానితో పాటు మల్కన్‌గిరి జిల్లా బాధ్యతలు అదనంగా చేర్చారనన్నారు. ఇటీవల కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షునిగా గెలిపొందిన విషయం గుర్తు చేశారు. బ్యాంక్ అధ్యక్ష హోదాలో తరచూ కొరాపుట్, నబరంగ్‌పూర్, మల్కన్‌గిరి, రాయగడ జిల్లాల్లో పర్యటించాల్సి వస్తోందన్నారు. ఇన్ని బాధ్యతలు నిర్వహించడానికి సమయం కుదరడం లేదన్నారు. అందుకే పార్టీ నేతలను నచ్చజెప్పి జిల్లా అధ్యక్ష స్థానం వదులుకోవాల్సి వచ్చిందని తెలియజేశారు. అయినప్పటికీ పార్టీ తనకు పదోన్నతితో కూడిన రాష్ట్ర సాధారణ కార్యదర్శి పదవిని ప్రస్తుతం మరలా ఇచ్చిందన్నారు. అందరం ఐక్యంగా పనిచేసి కొరాపుట్ జిల్లాలో మొత్తం 5 ఎమ్మెల్యేలు, 1 ఎంపీ స్థానం గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశాడు. అనంతరం జిల్లా పార్టీ కొత్త అధ్యక్షుడు జిన్ను హిక్కా, ఉపాధ్యక్షుడు ప్రశాంత్ గుప్తాలను కార్యకర్తలు సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రఘురాం పాడాల్(కొరాపుట్), పీతం పాఢి(పొట్టంగి), పద్మిని దియాన్(కొట్‌పాడ్), ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర్ మజ్జి తదితరుల పాల్గొన్నారు.

టికెట్ ధరలు తగ్గింపు

● ఏసీ చైర్‌కార్ టిక్కెట్ల తగ్గింపునకు నిర్ణయం
● రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటన



భువనేశ్వర్: ట్రెన్‌లలో ఏసీ సిట్టింగ్ వసతి ఉన్న అన్ని రైళ్లలో ఏసీ చైర్ కార్ మరియు ఎగ్జిక్యూటివ్ శ్రేణుల్లో టికెట్ ధర తగ్గింపు పథకాన్ని రైల్వే మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టింది. ఈ శ్రేణుల్లో ప్రయాణికులను పెంచడమే ఈ పథకం లక్ష్యంగా పేర్కొంది. ఆక్యుపెన్సీ ఆధారంగా అన్ని శ్రేణుల్లో డిస్కౌంట్ కల్పించేందుకు వెసులుబాటు ఉంటుంది. ఈ సౌకర్యం తగ్గింపు తక్షణమే అమలులోకి వస్తుందని రైల్వే శాఖ తెలిపింది. ఇప్పటికే బుక్ చేసుకున్న ప్రయాణికులకు ఛార్జీల వాపసు అనుమతించబడదని స్పష్టం చేసింది. ప్రాథమిక ఛార్జీపై (బేసిక్ ఫేర్) మాత్రమే గరిష్టంగా 25% వరకు డిస్కౌంట్ ఉంటుందని పేర్కొంది. రిజర్వేషన్ ఛార్జీ, సూపర్ ఫాస్ట్ సర్‌ఛార్జి, ద్రవ్య సేవా పన్ను (జీఎస్‌టీ) తదితర ఛార్జీలు యథాతథంగా లెక్కించి వసూలు చేస్తారు. గత 30 రోజుల్లో 50% కంటే తక్కువ ఆక్యుపెన్సీ (ఎండ్‌టు ఎండ్ లేదా కొన్ని నిర్దేశిత మార్గాల్లో) ఉన్న రైళ్లకు మాత్రమే ఈ పథకం వర్తింపజేస్తారు.

ఫ్లెక్సీ ఫేర్ విభిన్నం

ఫ్లెక్సీ ఫేర్ రైళ్ల టికెట్లకు డిస్కౌంటు సదుపాయం రెండంచెల్లో వర్తింపజేస్తారు. తొలుత ప్రయోగాత్మకంగా ఫ్లెక్సీ ఫేర్ నిబంధన తొలగిస్తారు. ప్రయాణికుల రద్దీ పెరగని పరిస్థితుల్లో మలి దశలో 25 శాతం గరిష్ట డిసౌంట్ పథకం ప్రకారం తగ్గింపు ధరల్ని విస్తరిస్తారు. సెలవులు, పండగ రోజులు వంటి ప్రత్యేక సందర్భాల్లో రద్దీ నియంత్రణకు నడిపించే ప్రత్యేక రైళ్లలో ఈ పథకం వర్తించదు. రైల్వే సిబ్బంది పీటీవో, పాస్‌లు, రాయితీ వోచర్‌లు, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల కూపన్‌లు, వారెంట్‌లు, ఎంపీలు, మాజీ ఎంపీలు, స్వాతంత్ర్య సమరయోధులు మొదలైన వాటిపై టిక్కెట్‌లు సాధారణ ధరలకే బుక్ చేయాల్సి ఉంటుంది. ఈ వర్గాలకు 25 శాతం తగ్గింపు పథకం నుంచి మినహాయించారు. ఈ పథకం తత్కాల్ కోటా రిజర్వేషన్‌కు వర్తించదు.

అధికారులకు నిర్ణయాధికారం

ఏసీ సిట్టింగ్, ఎగ్జిక్యూటివ్ శ్రేణుల్లో ఖాళీలు తగ్గించే దిశలో రాయితీ చార్జీల అమలు, కొనసాగింపు ఇతరేతర అనుబంధ విషయాల్లో జోనల్ రైల్వే అధికారులకు నిర్ణయాధికారం కల్పించినట్లు రైల్వే శాఖ తెలిపింది. జోనల్ ప్రిన్సిపాల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్లు ఈ వ్యవహారం పర్యవేక్షిస్తారు. రాయితీ వాస్తవ అమలు నుంచి గరిష్టంగా ఆరు నెలల వరకు వర్తిస్తుంది. ఈ వ్యవధిలో నెలవారీ, వారం రోజులు, వారాంతం ప్రాతిపదికన రాయితీ సౌకర్యం స్పందనను నిరంతరం విశ్లేషించి తదుపరి పొడిగింపు, కుదింపు, నిలిపివేత (ఉపసంహరణ) వంటి నిర్ణయాలు ప్రకటిస్తారు. అత్యధికంగా ఏడాదిపాటు తగ్గింపు పథకం పొడిగింపు కొనసాగించేందుకు వెసులుబాటు కల్పించారు. డిస్కౌంట్ పథకం ఉపసంహరణ అమలు నిర్ణయం తక్షణమే అమలు చేసిన రిజర్వేషన్ ఇతరేతర కారణాలతో ముందస్తుగా కొనుగోలు చేసిన రాయితీ టికెట్లపై ఎటువంటి అదనపు చార్జీ (తేడా మొత్తం) వసూలు చేయరాదని రైల్వే శాఖ జోనల్ శాఖలకు జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కరెంటు బుకింగ్ పురస్కరించుకుని రైలులో టీటీఈ తగ్గింపు పథకం లెక్క ప్రకారం చార్జీ వసూలు చేయాల్సి ఉంటుంది. ఈ సదుపాయం పథకం అమల్లో ఉన్నంత వరకు మాత్రమే పరిమితం.

విజృంభిస్తున్న డెంగీ

● అపరిశుభ్రంగా కాలువలు
● పెరుగుతున్న దోమలు



ఎంకేసీజీలో చికిత్స పొందుతున్న డెంగీ వ్యాధిగ్రస్తులు



హౌసింగ్ బోర్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

బరంపురం: నగరంలో అధికారుల నిర్లక్ష్యంతో గతేడాది రికార్డు స్థాయిలో డెంగీ ప్రజలను పట్టిపీడించింది. సరిగా ఈ ఏడాది సైతం అపరిశుభ్రమైన కాలువలు కారణంగా దోమలు విజృంభించి మరలా డెంగీ కేసులు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వివిధ వార్డుల్లో నివసిస్తున్న ప్రజలు డెంగీతో ఎంకేసీజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్పష్టమవుతోంది. రెండు రోజుల క్రితం అంకులి నుంచి ఒక మహిళా జ్వరంతో బాధపడుతూ ఎంకేసీజీ అస్పత్రిలో చేరగా, మహిళ రక్త పరిక్ష నమూనాలు మైక్రో బయాలజీ కేంద్రానికి పంపగా రక్త పరిక్షల్లో డెంగీ వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయిందని జిల్లా మలేరియా అధికారి ఉమా శంకర్ మిశ్రా తెలియజేశారు. ఇదేవిధంగా గత కొద్ది రోజుల నుంచి వరుసగా జ్వరం, తలనొప్పి, కాళ్లు, చేతుల పీకులతో బాధపడుతూ పదుల సంఖ్యలో పెద్ద ఆస్పత్రిలో చేరగా వైద్యులు రక్త పరీక్షలు జరిపిన అనంతరం వీరంతా డెంగీ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



మురుగు నీటితో కంపు కొడుతున్న క్రీడా మైదానం రోడ్డు

యువజన కాంగ్రెస్ విభిన్న నిరసన

● మంత్రి ఇంటి ముందు చౌక ధరలకే కూరగాయల విక్రయం



మంత్రి ఇంటి ముందు కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ విభాగంవిభిన్న రీతిలో నిరసన తెలిపింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వంయి ఇంటి ముందు కాంగ్రెస్ కార్యకర్తలు తాత్కాలిక చౌక ధరల కూరగాయల విక్రయ కేంద్రాన్ని ఆదివారం తెరిచారు. టమాటా కిలో రూ.50లు, వంకాయలు కిలో రూ.30లు, అల్లం కిలో రూ.70లు, బీన్స్ కిలో రూ.50లు, పచ్చి మిర్చి కిలో రూ.50లు, సారకంద కిలో రూ.30ల ధరలకే విక్రయించారు. చివరగా మిగులు కూరగాయలను సంచిలో సర్ది మంత్రి ఇంటి ప్రధాన ప్రవేశమార్గం గేటుకు వేలాడించి ఆందోళన విరమించారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తల తాత్కాలిక చౌక ధరల కూరగాయల దుకాణంలో కొనుగోలు చేసేందుకు రద్దీ గుమిగూడింది. కూరగాయల ధరల విపరీత పెరుగుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యులని యువజన కాంగ్రెసు ఆరోపించింది.

'ప్రజలు మార్పు కోరుకుంటున్నారు'



మాట్లాడుతున్న భిభుతి జెనా తదితరులు

బరంపురం: రాష్ట్రంలోని ప్రజలు అధికార మార్పిడి కోరుకుంటున్నారని గంజాం జిల్లా బీజేపీ అధ్యక్షుడు భిభుతి జెనా అన్నారు. స్థానిక జిల్లా బీజేపీ కార్యాలయంలో దక్షిణ ఒడిశా స్థాయి పార్టీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒడిశాలో గత కొన్నేళ్లుగా జరుగుతున్న అవినీతి పాలనకు వ్యతిరేకంగా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలియజేశారు. రానున్న 2024 ఎన్నికల్లో ఒడిశాలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలన్నీ బీజేడీ నాయకులకే అందుతున్నాయని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

బైక్ దొంగల ముఠా అరెస్టు



పట్టుబడిన మోటారు బైక్‌లు

జయపురం: అంతర్ రాష్ట్ర బైక్ దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. జయపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారి హరీష్ బి.సి స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరుచుగా బైక్‌లు దొంగలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అరెస్టు చేయబడినవారు జయపురం విక్రమనగర్ లాల్‌సాహి గ్రామానికి చెందిన ఎల్.అఖిల్ ఉరఫ్ ఉదయ్(22), బొయిపరిగుడ సమితి దసమంతపూర్‌కు చెందిన కృష్ణ నాయిక్ (19)లుగా వెల్లడించారు. వారిద్దరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచామని, అలాగే నవరంగపూర్ జిల్లా కొడింగ సమితి చొటాహండికి చెందిన పద్మణ హరిజన్ ఉరఫ్ గులెట్(25)ని అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నామని వెల్లడించారు. నిందితుల నుంచి 11 మోటారు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ముఠాలో ఇకెంతమంది ఉన్నారో తెలుసుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు.

ఇలా పట్టుబడ్డారు

జయపురం పవర్ హౌస్ కాలనీలో ఉంటున్న జి.గణేష్ తన బైక్ దొంగిలించబడిందని ఫిర్యాదు చేశాడు. ఆ బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వెళ్తున్నట్లు తెలిసిందని ఆయన తెలియజేశారు. పోలీసులు నిందితులు దొంగిలించిన బైక్‌ను వెంబడించి గాంధీ కూడలి వద్ద పట్టుకున్నారు. వారిని పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించగా తాము అనేక బైక్‌లు దొంగిలించి నవరంగపూర్ జిల్లా కొడింగ సమితి ఛొటాహండి గ్రామంలో పద్మన్ హరిజన్‌కు అమ్మినట్లు తెలియజేశారు. అనంతరం పోలీసులు సబ్ ఇన్‌స్పెక్టర్ మహంతి బెహర, ఏఎస్‌ఐ విష్ణు మడకామిలతో ఒక టీమ్ ఏర్పాటు చేశారు. కొడింగ పోలీసుల సహకారంతో చొటాహండి గ్రామంలో దాడి నిర్వహించగా, ఆ సమయంలో పద్మన్ 10 బైక్‌లు అమ్మేందుకు పెట్టాడని తెలిపారు. అతడి నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లలో జయపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో దొంగలించబడిన 4 బైక్‌లు, కొరాపుట్ పట్టణం, జయపురం సదర్, కుంద్రా పోలీసుస్టేషన్ల పరిధిలో ఒక్కొక్క బైక్‌లు కాగా, రెండు బైక్‌లు ఛత్తీష్‌ఘడ్ రాష్ట్ర జగదల్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోనివి, అలాగే బెలడిల్లా పోలీసుస్టేషన్ పరిధిలో ఒకటి కాగా, తెలంగాణ రాష్ట్రం నల్గొండ పోలీసుస్టేషన్ పరిధిలో ఒక బైక్ దొంగిలించబడిందని వివరించారు. అదేవిధంగా నంబరు లేని ఒక బైక్ సైతం వారి నుంచి సీజ్ చేసినట్లు వెల్లడించారు. బైక్‌ల యజమానులు అవసరమైన డాక్యుమెంట్స్ సమర్పించి వారి బైక్‌లను తీసుకెళ్లవచ్చని తెలియజేశారు. సమావేశంలో జయపురం పట్టణ పోలీసు అధికారి సంబిత్ కుమార్ బెహర, ఎస్‌ఐ సంజయ కుమార్ మహంతి, సిద్ధార్థ కుమార్ బెహరలు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో హరీష్ తదితరులు

మొక్కలతోనే జీవరాశి మనుగడ



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న సీవా సభ్యులు



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ షాడంగి

జయపురం: మొక్కలతోనే జీవరాశి మనుగడ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. జయపురం సోషియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ వెల్ఫేర్ అసోషియేషన్ (సీవా) ఆధ్వర్యంలో సయపురం ఎల్లో వంతెన ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా సీవా అధ్యక్షుడు సుధాకర్ పట్నాయక్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కల సంరక్షణకు అవసరమైన ఎరువులు, క్రిమి సంహారక మందులను ప్రజలకు అందజేశారు. అలాగే స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు, జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర పర్యవేక్షణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు జడ్జి డాక్టర్ పవిత్ర మోహన్ సామల్, స్వాతంత్ర్య విజిలెన్స్ జడ్జి రాజేష్ ఎక్కా, అదనపు జిల్లా జడ్జి సిహెచ్ బాసుదేవ్ పాత్రో, చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ దిలీప్ సాహు, ప్రదీకరణ కార్యదర్శి సచీవ్ కుమార్ జెన, రిజిస్ట్రార్ బి.ప్రసాద్ దేవత, ఎస్‌డీజేఎం సంజయ్ కుమార్ బెహర, ప్రథమ శ్రేణి జడ్జి ఆదర్శ బెహర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోనూ మొక్కలు నాటారు. సబ్ కలెక్టర్ బేదబర ప్రధాన్‌తో పాటు ఆఫీసు సిబ్బంది వివిధ రకాల 40 మొక్కలు నాటారు. అలాగే ఆటో యూనియన్ వారు జయపురం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాగరిక షాడంగి, ఆటో అసోసియేషన్ సాధారణ కార్యదర్శి నారాయణ రథ్, అడ్వైజర్ చిన్మయ సాహు, కోశాధికారి ఉమేష్ సాహు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లో వంతెన ప్రాంత ప్రజలకు మొక్కలు అందజేస్తున్న సీవా ప్రతినిధులు



కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జి సత్యనారాయణ మిశ్ర తదితరులు

క్లుప్తంగా

ఘాట్‌రోడ్డులో లారీ బోల్తా


లోయలో పడిన లారీ

పాచిపెంట: మండలంలోని ఆంధ్రా ఒడిశా జాతీయరహదారి పి.కోనవలస ఘాట్ రోడ్డు వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ లారీ బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీని, సుంకి నుంచి సాలూరు వస్తున్న లారీ ఘాట్‌రోడ్డు వద్ద ఢీకొంది. దీంతో బొగ్గు లారీ పక్కనే ఉన్న లోయలో బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో డ్రైవరు, క్లీనర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీనిపై కేసు నమోదుచేశామని ఎస్‌ఐ ఫక్రుద్దీన్ తెలిపారు.

కొండచిలువ హతం


గంగన్నపాడులో హతం చేసిన కొండచిలువ

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు గ్రామ సమీపంలో సంచరిస్తున్న 12 అడుగుల పొడవైన కొండచిలువను ఆదివారం ఉదయం గ్రామస్తులు హతం చేశారు. గ్రామానికి దగ్గరలో గల తోటపల్లి ప్రధాన కుడికాలువకు సమీపంలోని పంట పొలాల్లో కొంతమంది కొండచిలువను చూసి భయపడ్డారు. రోడ్డు పక్కన పొలాల్లో ఉన్న కొండచిలువను చూసిన వారు గ్రామానికి చెందిన మరికొంత మందికి తెలియజేయడంతో అంతా వచ్చి కొట్టి చంపేశారు.

132 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు


నిందితులు, మద్యం బాటిల్స్‌తో ఏఎస్సై భాస్కర రావు

బొబ్బిలి: మండలంలోని శివడవలసకు చెందిన శంబంగి చిన్నారావు, ఒబ్బిశెట్టి చంద్రరావులు బైక్‌పై రూ.20,720ల విలువైన 132 మద్యం సీసాలను తరలిస్తుండగా ఏఎస్సై గొడు భాస్కరరావుకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. నిందితులిద్దరి నుంచి మద్యం బాటిల్స్, బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై విలేకరులకు తెలిపారు.

ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలు


గాయాల పాలైన బాధితులు

బలిజిపేట: వెంగాపురం-పదమాయవలస రహదారిలో ఆటో బోల్తాపడడంతో ముగ్గురు గాయాల పాలయ్యారు. వీరఘట్టం మండలం కత్తులకవిటి గ్రామానికి చెందిన వీరు బలిజిపేట మండలం తుమరాడ గ్రామంలో ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి వెళ్తుండగా వెంగాపురం సమీపంలో బైక్ ఎదురుగా రాగా ఆటో బోల్తా పడడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నాగమణి, సత్యవతి, రాంబాబులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పార్వతీపురం హాస్పిటల్‌కు 108వాహనంలో తరలించారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడికి గాయాలు


విద్యుదాఘాతానికి గురైన మనోజ్

పాచిపెంట: మండలంలోని కోడికాళ్లవలస గ్రామానికి చెందిన బాలుడు మనోజ్ విద్యుత్ షాక్‌కు గురై గాయాలపాలయ్యాడు. గ్రామానికిచెందిన మనోజ్, మరో నలుగురు స్నేహితులు కలిసి శనివారం సైకిళ్లపై మడవలస వద్ద వాటర్‌ఫాల్స్‌కు పయనమయ్యారు. ఈ క్రమంలో సమీప డొంకల్లో బహిర్భూమికి వెళ్లిన మనోజ్ అటుగావెళ్తున్న విద్యుత్ వైర్లను గమనించకపోవడంతో అవి తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే సాలూరు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం, విజయనగరం కేంద్రాస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యుల సిఫారసు మేరకు ఆదివారం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

భక్తిశ్రద్ధలతో బోల్‌భం దీక్షలు


నదీ జలాలను తీసుకెళ్తున్న భక్తులు


పూజలు నిర్వహిస్తున్న బోల్‌భం దీక్షాధారులు

బరంపురం: మహా శివుడికి ఇష్టమైన శ్రావణ మాసం సందర్భంగా జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో బోల్‌భం దీక్షలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం నగరానికి దగ్గర ఉజ్జలేశ్వర్ ఆలయానికి దీక్షాధారులు కావిళ్లలో పవిత్ర నదీ జలాలను తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇద్దరు రైల్వే ఉద్యోగులకు సీబీఐ నోటీసులు

భువనేశ్వర్: బహనాగా రైలు దుర్ఘటన విచారణ పగడ్బందీగా కొనసాగుతోంది. సీబీఐ ఈ కేసు దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ముగ్గురు రైల్వే సిబ్బందిని అరెస్టు చేసిన దర్యాప్తు బృందం, తాజాగా మరో ఇద్దరికి నోటీసులు జారీ చేసింది. విచారణకు ప్రత్యక్షంగా హాజరు కావాలని వీరికి ఆదేశించింది. వీరిలో ఒకరు బహనాగా బజార్ స్టేషను మాస్టర్‌గా సమాచారం. మరోవైపు ఈ కేసులో అరెస్టైన ముగ్గురు రైల్వే అధికారులను సీబీఐ ప్రత్యేక బృందం లోతుగా విచారిస్తోంది. సిగ్నలింగ్ లోపం వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తేలగా, అది జరిగిన పరిస్థితులు, ప్రమాదం జరిగిన తర్వాత సాక్ష్యాధారాలు గల్లంతు చేసేందుకు ఎందుకు ప్రయత్నించారు, దీని వెనుక కుట్ర ఉందా లేదా అనే విషయాలపై సీబీఐ తదుపరి విచారణ చేపట్టింది. ఈ అంశాలపై 5 రోజుల రిమాండ్‌లో ఉన్న ముగ్గురు రైల్వే అధికారులను చందకా పోలీస్ స్టేషన్‌లో విడివిడిగా ప్రశ్నిస్తున్నారు. ముగ్గురు నిందితులు అరుణ్ మహంత్, మహ్మద్ అమీర్ ఖాన్ మరియు పప్పు కుమార్‌లతో సీబీఐ బృందం ఆదివారం ప్రమాద స్థలంతో సారో మరియు బాలేశ్వర్ సిగ్నల్ రూమ్ మరియు రిలే రూమ్ ప్రాంతాలు ప్రత్యక్షంగా పర్యవేక్షించి దర్యాప్తు చేపట్టడం విశేషం. ఎస్పీ, డీఐజీ హోదా అధికారులు విచారణలో నిమగ్నమయ్యారు. రిమాండ్ వ్యవధి 4 రోజులు ఉండగా నిందితుల నుంచి కీలక సమాచారాన్ని రాబట్టేందుకు దర్యాప్తు బృందం ప్రయత్నిస్తోంది. ప్రధానంగా విధ్వంసకర పరిస్థితులేమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు ఎప్పటికప్పుడు పలు మలుపులు తిరుగుతుంది.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

విజయనగరం పూల్‌బాగ్: అగ్రిగోల్డ్ బాధితుల కు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, ఉత్తరాంధ్ర జిల్లాల గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు అన్నారు. ఆదివా రం స్థానిక అమర్ భవన్‌లో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సూరప్పడు ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, ఆగస్టు 15వ తేదీలోగా బాధ్యులకు పూర్తి న్యాయం చేయాలని.. లేకుంటే 30వ తేదీన విజయవాడలో భారీ ఆందోళన చేపట్టనున్నట్లు చెప్పారు.

సమాజ హితం కోరే ప్రతి పని అభినందనీయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



ఆషాడం సారె కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల


నృత్యాలు చేస్తున్న హిజ్రాలు, భక్తులు

విజయనగరం టౌన్: సమాజ హితం కోరే ప్రతి మంచి పని అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రశంసించారు. శ్రీ విజయసాగర దుర్గమ్మ తల్లికి ఆషాడం సారె సమర్పణ కార్యక్రమాన్ని కోట వద్ద ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన డిప్యూటీస్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోరే వారికి తమవంతు చేయూత ఎప్పుడూ ఉంటుందన్నారు. కొన్నేళ్లుగా అమ్మవారికి హిజ్రా అసోసియేషన్ అధ్యక్షుడు దవడ కొండబాబు ఆధ్వర్యంలో సారె సమర్పించడం ఎంతో పుణ్యకార్యక్రమమన్నారు. అనంతరం ఏడు బళ్లలో ఆషాడం సారెను సమర్పించారు. జిల్లాలో కొత్తగా పెళ్లైన ప్రతి ఆడబిడ్డ సుఖసంతోషాలతో పసుపు, కుంకుమలతో పదికాలాల పాటు చల్లగా ఉండాలని కోరుతూ అమ్మవారికి ప్రతి ఏడాది సారె సమర్పిస్తున్నామని హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ అధ్యక్షుడు కొండబాబు, కోశాధికారి దవడ మీనా, స్రవంతిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఘటాలు సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు


విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. నగరంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో అండర్-17, 19 విభాగాల్లో బాలబాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాలతో పాటు సీనియర్స్ విభాగంలో స్త్రీ, పురుషులకు పోటీలు జరగ్గా జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు హాజరై పోటీపడ్డారు. అండర్-17 విభాగంలో 8 మంది క్రీడాకారులు విజేతలుగా నిలవగా వారు ఈనెల 22 నుంచి నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. అలాగే అండర్-19 విభాగంలో సత్తా చాటిన 8 మంది త్వరలో చిత్తూరు జిల్లాలో జరిగే అంతర్‌జిల్లాల పోటీల్లో పాల్గొనున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్, సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్, అసోసియేషన్ ప్రతినిధులు ఎంకేబీ శ్రీను, నున్న సురేష్, పాట్నూరు శ్రీరాములు తదితరులు బహుమతులు అందజేసి అభినందించారు.

చురుగ్గా వంతెన పిల్లర్ల ఏర్పాటు


వంతెన తొలి పిల్లర్ల నిర్మాణం

సంతకవిటి: మండలంలోని వాల్తేరు గ్రామం వద్ద నాగావళి నదిపై బలసలరేవు నుంచి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం ఇసుకలపేట వరకూ చేపట్టిన వంతెన పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రూ.87 కోట్ల అంచనాతో ప్రారంభమైన ఈ పనుల్లో 560 మీటర్ల పొడవునా వంతెన నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం వాల్తేరు వైపు తొలిపిల్లర్ నిర్మాణం ప్రారంభించారు. ఈ నిర్మాణాలను కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడుతో పాటు ఆర్అండ్‌బీ ఏఈ ఆంజనేయులు నాయక్ ఆదివారం పరిశీలించారు.

మంచినీటి కోనేర్లకు మహర్దశ

- ఉపాధి నిధులతో పునరుద్ధరణ
- జిల్లాలో 46 గుర్తింపు


దబ్బిరాజుపేటలో పనులు చేపట్టకముందు తుప్పలతో నేపాలం మొక్కలతో నిండిపోయిన కోనేరు


పనులు చేపట్టిన తర్వాత నీటితో ఉన్న కోనేరు

విజయనగరం ఫోర్ట్: పై ఫొటోలో నేపాలం మొక్కలతో కప్పేసి ఆనవాళ్లు కూడా లేకుండా ఉన్న కోనేరు వేపాడ మండలం దబ్బిరాజుపేట గ్రామంలోనిది. అధ్వాన స్థితిలో ఉన్న ఈ కోనేరును ఉపాధి నిధులతో గతంలో ఉండే కోనేరు విధంగా తయారు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఇప్పుడు ఈకోనేటి నీటితో పశువులు, గొర్రెలు దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

కింద ఫొటోలో మురికి కూపంలా కనిపిస్తున్న కోనేరు గంట్యాడ మండలం నరవ గ్రామంలోనిది. దుర్వాసన వచ్చే విధంగా తయారైన చెరువును ఉపాధి నిధులతో గతంలో ఉన్న మంచినీటి కోనేరులా సిద్ధం చేశారు. కోనేరు నీటితో ఇప్పుడు పశువులు, గొర్రెలు దాహార్తి తీర్చుకుంటున్నాయి.

ఈ రెండు మంచినీటి కోనేరులే కాదు. జిల్లా వ్యాప్తంగా పిచ్చి మొక్కలు, తుప్పలు, పనికిరాని వ్యర్థాలతో నిండిపోయిన మంచినీటి కోనేరులను యథాస్థితికి తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే పునరుద్ధరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలోని 46 మంచి నీటి కోనేరులను పునరుద్ధరించడానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు గుర్తించారు. తొలివిడతలో 23 కోనేరుల్లో పనులు చేపట్టారు. ఈ మేరకు గంట్యాడ, భోగాపురం, నెల్లిమర్ల, వేపాడ, రాజాం, రామభద్రపురం మండలాల్లో పనులు జరుగుతున్నాయి.


నరవ గ్రామంలో బురదమయంతో ఉన్న మంచినీటి కోనేరు


పనులు చేపట్టిన తర్వాత కోనేరులో నీరు తాగుతున్న గొర్రెలు

లక్ష్యం ఇది

ఎందుకు పనికిరాని విధంగా ఉన్న మంచినీటి కోనేరులను పునరుద్ధరణ ద్వారా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడం, భూగర్భ జలాలు మరింత అభివృద్ధి చేయడం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, పశువుల దాహార్తిని తీర్చడం, మంచినీటి కోనేరుల పునరుద్ధరణ లక్ష్యం.

ఉపాధిలో కోనేరుల అభివృద్ధి

మంచినీటి కోనేరుల పునరుద్ధరణ పనులు ఉపాధి పథకంలో జిల్లాలో చేపడుతున్నాం. వృథాగా ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో మంచినీటి కోనేరుల పునరుద్ధరణ పనులు చేస్తున్నాం. కోనేరులను వినియోగంలోకి తీసుకురావడం వల్ల పశువుల దాహార్తి కూడా తీరుతుంది.

– జి. ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ

ట్రక్కు దొంగతనం

- ఇద్దరు నిందితులు అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను చూపిస్తున్న పోలీసులు



దొంగతనానికి గురైన ట్రక్కు

బరంపురం: స్థానిక అస్కా రోడ్ ఫస్ట్ గేట్ మొదటి లైన్‌లో జరిగిన ట్రక్కు దోపిడీ ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి పెద్ద బజార్ పోలీసుస్టేషన్ పరిధి అస్కా రోడ్ ఫస్ట్ గేట్ మొదటి లైన్లో ట్రక్కు దోపిడీ జరిగింది. దీనిపై ట్రక్కు యజమాని సస్మీత సాహు పెద్ద బజార్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దోపిడీకి గురైన ట్రక్కు జిల్లాలోని బంజనగర్‌లో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం వెళ్లి ట్రక్కుని సీజ్ చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో కటక్ జిల్లా వరహా పోలీసుస్టేషన్ పరిధిలోని ఉదయపట్నం గ్రామానికి చెందిన సత్యజిత్ మోహంతి, డెంకనాల్ జిల్లా అసరడా గ్రామానికి చెందిన అశిష్ కుమార్ సాహులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

కాళ్ల పారాణి ఆరక ముందే..!

ఐదు నెలల క్రితం జరిగిన వివాహానంతరం కోటి ఆశలతో కొత్తజీవితంలోకి అడుగుపెట్టిన ఓ నవజంట భవిష్యత్తు గురించి ఎన్నో కలల కంటూ సంతోషంగా గడుపుతున్నారు. ఇంతలోనే విధికి కన్నుకుట్టడంతో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగిన ప్రమాదంలో నవ వరుడి ప్రాణాలు గాలిలో కలిసిపోగా నవవధువు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషాద వార్తతో రాజాం మండల పరిధిలోని బొద్దాం గ్రామస్తులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.

- ఉత్తరాఖండ్ ప్రమాదంలో చిక్కుకున్న నవజంట
- నవవరుడి మృతి..గాయాలతో బయటపడిన వధువు


గ్రామస్తుల నుంచి వివరాలు ఆరా తీస్తున్న తహసీల్దార్ ఎస్‌కేరాజు, ఆర్ఐ విద్యాసాగర్


భార్య కల్యాణితో రవిరావు (ఫైల్)

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామానికి చెందిన జరజాన రవిరావుకు, పట్టణ పరిధిలోని సారథికి చెందిన కల్యాణితో ఫిబ్రవరి 12న వివాహమైంది. రవిరావు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ భార్య కల్యాణితో జీవనం సాగిస్తున్నాడు. ఈ నవజంట వారం రోజుల క్రితం కేథారినాథ్ యాత్రకు హైదరాబాద్ నుంచి బయల్దేరింది. యాత్ర జాలీగా సాగుతున్న సమయంలో శనివారం రాత్రి (తెల్లవారితే ఆదివారం) అక్కడ భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడడంతో వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఉధృతంగా ప్రవహిస్తున్న గంగానదిలో ప్రయాణికులంతా గల్లంతయ్యారని తొలుత భావించారు. వెంటనే అప్రమత్తమైన రెస్క్యూటీం బాధితులను రక్షించే క్రమంలో కల్యాణితోపాటు మరికొంతమందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చింది. ముమ్మరగాలింపు చర్యలు చేపట్టిన తరువాత రవిరావు (29) మృతిచెందినట్లు గ్రామస్తులకు సమాచారం అందడంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఇదిలా ఉండగా మృతుని కుటుంబ సభ్యులంతా తగరపువలసలో జరుగుతున్న బాలసారె కార్యక్రమంలో ఉన్నారు. రవిరావు మృతి విషయం తెలుసుకున్న వీరంతా విషాదంలో మునిగిపోయారు.

అధికారుల ఆరా..

గ్రామానికి చెందిన రవిరావు దంపతులు తీర్థయాత్రకు వెళ్లి ప్రమాదం బారిన పడిన విషయంపై తహసీల్దార్ ఎస్‌కే రాజు, ఆర్ఐ విద్యాసాగర్‌లు గ్రామానికి వచ్చి ఆరా తీశారు. రవిరావు మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చేందుకు కృషిచేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లను కోరినట్లు గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క తవిటమ్మతో పాటు గ్రామస్తులు తెలిపారు.

అందుబాటులో పట్టణ ఆరోగ్య కేంద్రాలు

- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- విజయనగరం నియోజకవర్గంలో 12 పట్టణ పీహెచ్‌సీలు
- గ్రామీణ ప్రాంత ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా సేవలు


సారికలో మంచంపై ఉన్న రోగి ఇంటికి వెళ్లి వైద్యం అందిస్తున్న వైద్యుడు


వృద్ధురాలని పరీక్షిస్తున్న వైద్యురాలు

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పట్టణ ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా వైద్యసేవలు చేరువయ్యాయి. గతంలో పట్టణ ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు దూరంగా ఉండేవి. దీంతో వారికి వైద్య సేవలు సక్రమంగా అందేవి కావు. కాని ప్రస్తుత ప్రభుత్వం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంఖ్యను పెంచింది. ఐదు నిమిషా ల నుంచి పది నిమిషాల్లో ఆస్పత్రికి చేరుకునే విధంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంఖ్యను ప్రభుత్వం పెంచింది. గతంలో విజయనగరంలో నాలుగు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్యను 12కు పెంచారు. దీంతో ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలున్నా కేంద్రాల కు వెళ్లి వైద్యసేవలు పొందుతున్నారు. విజయనగ రం పట్టణంలో పూల్‌బాగ్, వీటీ అగ్రహారం, రాజీవ్‌నగర్ , లంకాపట్నం, ఇస్మాయిల్ కాలనీ, ఉల్లివీధి, అరుంధతీనగర్, జొన్నగుడ్డి, కేఎల్ పురం, సాయినా థకాలనీ, సంతపేట, వినాయకనగర్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.

సకాలంలో అందనున్న వైద్య సేవలు..

పట్టణ పీహెచ్‌సీలు ప్రజలకు దగ్గరగా ఏర్పాటు చేయడం వల్ల సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. సకాలంలో ఆస్పత్రికి చేరడం వల్ల రోగిని ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించవచ్చు. అంతేకాకుండా సీజనల్‌గా వచ్చే జ్వరం, దగ్గు, జలుబు వంటి వ్యాధులకు జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, సీహెచ్ సీ, ప్రైవేట ఆస్పత్రులకు వెళ్లనవసరం ఉండదు. పట్టణ ప్రజలు అందుబాటులో ఉండే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యం చేయించుకోవ చ్చు. గర్భిణులు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు కూడా కేంద్రాల్లో వేస్తున్నారు. హెచ్‌బీ, బీపీ, సుగర్, మలేరియా వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా జరుగుతున్నాయి.

25 వేల జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం..

గతంలో 60 వేల నుంచి 70 వేల జనాభాకు ఒక పట్టణ ప్రాథమిక ఆరోగ్యం ఉండేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్టణ ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు అందించడానికి 25 వేల జనాభాకే ఒక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

ఆదుకుంటున్న ఫ్యామిలీ డాక్టర్ ..

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటివద్దే మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విజయనగరం మండలంలో 12 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయం పరిధిలో నెలలో రెండు పర్యాయాలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం 9 గంటల కల్లా సచివాలయం వద్దకు చేరుకుని అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం వద్దకు వచ్చే వారికి వైద్య తనిఖీలు నిర్వహిస్తారు. అదేవిధంగా బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు చేస్తారు. మధ్యాహ్నం రెండు 2 గంటల తర్వాత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థులకు తనిఖీలు నిర్వహిస్తారు. ఆ తర్వాత మంచంపై లేవలేని వారి ఇళ్లకు వెళ్లి చికిత్స అందిస్తారు. విజయనగరం మండలంలో ఆక్టోబర్ 2022న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్ర మం ప్రారంభమైంది. అప్పటినుంచి మే నెలఖారు నాటికి 11,311 మందికి వైద్య సేవలు అందించారు. ఇందులో జనరల్ ఓపీ 6,475, రక్తహీనత ఉన్న వారికి 98 మందికి, గర్భిణులు 504 మందికి, బాలింతలు 289 మందికి, క్షయ రోగులు 19 మందికి, బీపీ రోగులకు 1,883 మందికి, సుగర్ పరీక్షలు 1137 మందికి, బీపీ, సుగర్ రెండు వ్యాధులున్న వారికి 890 మందికి వైద్య సేవలు అందించారు.

క్లుప్తంగా

'గొర్రెలు, మేకల పెంపకదారులకు అండగా ఉంటాం'

కాశీబుగ్గ: జిల్లాలోని గొర్రెలు, మేకల పెంపకదారులకు అండగా ఉంటామని షీప్ ఫెడరేషన్ (రాష్ట్ర గొర్రెల, మేకల సంఘం) శ్రీకాకుళం జిల్లా ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పి.సూర్యం, షీప్ ఫెడరేషన్ చైర్మన్ ప్రకాష్ అన్నారు. పలాస నియోజకవర్గ పర్యటనలో భాగంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సూర్యరాజ్ ఇన్ మీటింగ్ హాల్‌లో ఆదివారం గొర్రెల, మేకల పెంపకదారులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలోని గొర్రెలు,మేకలు పెంపకందారులతో పాటు పలాస నియోజకవర్గానికి సంబంధించిన పెంపకందారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పి.సూర్యం వివిధ రకాల పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ పానిల శ్రావణి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ అందాల శేషగిరి, జిల్లా యాదవ కుల ఉపాధ్యక్షుడు రాపాక చిన్నారావు, లోహరిబంద సర్పంచ్ రాపాక శేషగిరి, కొండూరు సర్పంచ్ కొల్లి జోగారావు, రైతు సంఘ అధ్యక్షుడు మామిడి మాధవరావు, ఐతి ఈశ్వరరావు, రమణ, డొక్కరి దిలిప్‌కుమార్, కొర్రాయి గిరి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పరిశీలన

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నిర్మితమవుతున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రిని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం పరిశీలించారు. ముందుగా బి-బ్లాక్‌ను పరిశీలించి రెండు అంతస్తుల్లో జరుగుతున్న పనులు పరిశీలించారు. కిడ్నీరోగులకు డయాలసిస్ సేవలు అందించే గదులలో వాడుతున్న సామగ్రి కంపెనీల పేర్లు, నాణ్యతా ప్రమాణాలు పరిశీలించారు. త్వరలోనే ప్రారంభానికి సిద్ధం అవుతుండడంతో అన్ని పనులను నిశితంగా గమనించారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తా


మాట్లాడుతున్న ఛోటా కె.నాయుడు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలోని ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్‌ల సంక్షేమానికి తన వంతుగా కృషిచేస్తానని ఫొటో అండ్ వీడియో సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఛోటా కె.నాయుడు అన్నారు. ఫొటో అండ్ వీడియో సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఫొటో ఎక్స్‌పో కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఛోటా కె.నాయుడు మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో రోజు రోజుకీ టెక్నాలజీ మారుతోందని, మారుతున్న కాలానికి అనుగుణంగా మనం కూడా మారి ప్రజలను ఆకట్టుకోవాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఫొటో ఎక్స్‌పో పెట్టడం గొప్ప విశేషమన్నారు. ఈ ఎక్స్‌పో ఇంతటి విజయవంతం కావడానికి ఫొటో అండ్ వీడియో సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు చేసిన కృషి అమోఘమన్నారు. ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1,60,000 ఫొటోగ్రాఫర్ల కుటుంబాలు ఉన్నాయన్నారు. గత మూడేళ్లుగా జిల్లాలో ఫొటో ఎక్స్‌పో పెట్టాలని అవిశ్రాంత కృషి చేశానని, ఇందులో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానన్నారు. అయితే ఫొటో ఎక్స్‌పో విజయవంతం కావడంతో అవన్నీ మరచిపోయానన్నారు. జిల్లాలో ఒక ఫొటో భవన్ నిర్మించేందుకు తన వంతుగా కృషిచేస్తానన్నారు. అలాగే ఫొటో, వీడియోగ్రాఫర్ ఎవరైనా ఆకస్మికంగా మరణిస్తే వారి కుటుంబానికి రూ.3లక్షలు ఆర్థిక సాయం అందేలా పథకం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పలువురు ఫొటోగ్రాఫర్లను ఛోటా కె.నాయుడు చేతులమీదుగా సత్కరించారు.

విద్యావేత్త దీర్ఘారావుకు నివాళులు

కంచిలి: మండలంలోని బూరగాం గ్రామానికి చెందిన విద్యావేత్త, దివంగత ప్రొఫెసర్ కొర్రాయి దీర్ఘారావుకు వక్తలు ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతిచెందిన సంగతి తెలిసిందే. స్వగ్రామం బూరగాంలో ఆదివారం పెద్దకర్మ నిర్వహించారు. కార్యక్రమంలో కంచిలి, సోంపేట ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, డాక్టర్ నిమ్మన దాస్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవ పాత్రో, పిల్లల లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి విరాళాల వెల్లువ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వివిధ సేవలు, అభివృద్ధి పనుల నిమిత్తం పలువురు భక్తులు ఆదివారం విరాళాలు సమర్పించారు. అనకాపల్లి జిల్లా వి.మాడుగులకు చెందిన శ్రీనాథ శ్రీనివాసరావు, పరమేశ్వరి దంపతులు తమ కుమారుడు శ్రీనాథ స్వరూప్, సుజాతల పేరిట అభివృద్ధి పనుల కోసం రూ.1,01,001, శాశ్వత అన్నదాన పథకానికి రూ.25వేలు విరాళాన్ని ఈవో వి.హరి సూర్యప్రకాష్‌కు అందజేశారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా మామిడిపల్లికి చెందిన ఎం.పద్మలత శాశ్వత అన్నదానానికి రూ.1,00,116 విరాళం ఈవోకు అందజేశారు



అమ్మరూపం.. అపురూపం

పాతపట్నంలోని నీలమణి దుర్గ అమ్మవారిని ఆషాడ మాసం సందర్భంగా శాకంబరిగా ఆదివారం అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మను దర్శించుకున్నారు.

-పాతపట్నం

వర్షాల కోసం కప్ప సంబరం



అల్లినగరం గ్రామంలో ఆదివారం వర్షాలు కురవాలని కప్ప సంబరం నిర్వహించారు. కప్పల సంబరం నిర్వహిస్తే వర్షాలు కురుస్తాయని, పంటలు పండుతాయని ప్రజలు విశ్వసిస్తారు. మహిళలు సంబరంలో పాల్గొని కప్పలకు బిందెలతో నీళ్ల పోశారు. ఊరంతా కప్పలను ఊరేగించారు.

ఎచ్చెర్ల క్యాంపస్

పుస్తకంతో నేస్తరికం!


రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలు

- నాణ్యమైన పాఠ్య పుస్తకాలు అందజేయడంలో ప్రభుత్వం సక్సెస్
- విద్యార్థులను ఆకట్టుకుంటున్న పుస్తకాలు
- జిల్లాలో సెమిస్టర్-1 కోసం 19.30 లక్షల పాఠ్య పుస్తకాల పంపిణీ
- పాఠ్యాంశాలకు సరికొత్తగా 'క్యూ ఆర్ కోడింగ్' ఏర్పాటు
- త్వరలోనే సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాల రాక



శ్రీకాకుళం న్యూకాలనీ: బడి గంట మోగిన తొలిరోజే విద్యార్థుల చేతికి పాఠ్య పుస్తకాలు అందించడంలో సర్కారు విజయవంతమైంది. జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభించిన రోజే పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఈ పాఠ్య పుస్తకాలు పిల్లలకు నేస్తాల్లా మారాయి. వీటి నాణ్యత, అధునాతన సాంకేతికత ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

సరి'కొత్త' హంగులతో..


విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నూతన పాఠ్యపుస్తకాలను కొత్త హంగులతో నాణ్యతగా తయారు చేసి అందజేశారు. ఆకర్షణీయ చిత్రాలు, కార్టూన్లు, రంగులు, నాణ్యమైన పేపర్, ఆయిల్ ప్రింటింగ్‌తో అందిన పుస్తకాలు విద్యార్థుల మనస్సు దోచుకుంటున్నాయి.

మూడుకు బదులు రెండు సెమిస్టర్లుగా..

విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు పుస్తకాల బరువు తగ్గించేందుకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను సెమిస్టర్ల వారీగా ముద్రిస్తున్న విషయం తెలిసిందే. గత ఏడాది మూడేసి సెమిస్టర్లను ముద్రించగా ఈ ఏడాది దాన్ని రెండు సెమిస్టర్లకు కుదించారు. దీని వల్ల టైటిల్స్ సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం 1 నుంచి 10వ తరగతులకు లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ కలిపి 113 టైటిల్స్ ముద్రించారు. శ్రీకాకుళం జిల్లాలో 1.91 లక్షల మంది విద్యార్థులకు 19.30 లక్షల పాఠ్యపుస్తకాలను సెమిస్టర్-1 కింద విద్యార్థులకు అందజేశారు. ఇక సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలు త్వరలో జిల్లా కేంద్రానికి చేరుకోనున్నాయి.

చిత్రాలు, రంగులతో కొత్త రూపు..

విద్యార్థులకు పుస్తకాల పంపిణీని పాఠశాల విద్యాశాఖ ఈ ఏడాది పకడ్బందీగా చేపట్టింది. సబ్జెక్టులు, సెమిస్టర్ల వారీగా పుస్తకాలను అందజేశారు. పుస్తకాలు దుర్వినియోగం కాకుండా విద్యార్థుల సంఖ్య ఆధారంగా పంపిణీ చేశారు. పై తరగతుల వారికి ఆయా సబ్జెక్టు పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన వీడియో వివరణలను అందుబాటులో ఉంచారు. పుస్తకంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్ ద్వారా స్కాన్ చేసిన వెంటనే సంబంధిత విషయానికి సంబంధించిన అదనపు సమాచారంతో కూడిన వీడియోలు అందుబాటులోకి వచ్చేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం కొత్త పాఠ్యపుస్తకాలపై ఆసక్తి చూపుతున్నారు.


క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పాఠ్యపుస్తకం, ఓ పాఠ్యాంశం

ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా..



గతంలో పాఠ్యపుస్తకాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలు తెరిచిన రోజే పుస్తకాలు అందజేసేలా చర్యలు తీసుకుంది. ఈ ఏడాది బడులు పునఃప్రారంభమైన జూన్ 12వ తేదీన వంద శాతం పుస్తకాలను ఉంచాం. ద్విభాషతో కూడిన ప్రింటింగ్ చాలా అద్భుతం. నాణ్యతతో లేకుంటే పుస్తకాలను రిటర్న్ చేసేయమని 'సవాల్' పేరిట మండల కేంద్రాల్లో కౌంటర్లను సైతంఏర్పాటుచేశాం. ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో ఆలోచన చేసింది. పాఠ్యపుస్తకాల ముద్రణకు సాంకేతికతను జోడించారు. చాలా ఖర్చుతో కూడుకున్నదైనా ఆధునికతను జత చేయ డం శుభ పరిణామం. – డాక్టర్ ఎస్. తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

పుస్తకాలు బాగున్నాయి..



ప్రభుత్వ పాఠశాలలో అందించిన పాఠ్యపుస్తకాలు చాలా బాగున్నాయి. పాఠశాల తెరిచిన రోజే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగు, యూనిఫాం కిట్లు అందించారు. ఆయా సబ్జెక్టు పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ కూడిన వీడియో వివరణలను అందుబాటులో ఉంచారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా.. ఉపాధ్యాయులకు కూడా ఉపయుక్తంగా ఉన్నాయి.

– పేడాడ దాలినాయుడు, ఎంఈఓ-2 నరసన్నపేట, హెచ్‌ఎంల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

పుస్తకాలు చాలా బాగున్నాయి



మేము శ్రీకాకుళంలోని మంగువారితోట వద్ద ఉంటున్నాం. నాన్న శిల్లా నారాయణరావు రోజు కూలీ. అమ్మ శ్యామల. ఈ ఏడాది అందజేసిన పుస్తకాలు కొత్త కొత్త రంగులతో చాలా బాగున్నాయి. డిజిటల్ చదువులతో పాఠ్యాంశాలు అర్థమయ్యే రీతిలో ఉన్నాయి.

– శిల్లా గోపిక, 10వ తరగతి విద్యార్థిని, శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఆకట్టుకున్న ద్విగళ నవావధానం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో కోదండరామాలయ ప్రాంగణంలొ ఆదివారం నిర్వహించిన ద్విగళ నవావధానం ఆద్యంతం అలరించింది. ఈ సందర్భంగా ఉపనిషన్మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్ మాట్లాడుతూ ఈ ప్రక్రియ నూతనంగా మన జిల్లాలో మాత్రమే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అవధానం సంచాలకులుగా వ్యవహరించిన బంకుపల్లి రమేష్ శర్మ మాట్లాడుతూ ఇందులో ఇద్దరు అవధానులు, 9 మంది ప్రాశ్నికులు ఉంటారని, వారు అడిగిన ఒకే ప్రశ్నకు ఇద్దరు అవధానులు వేరువేరుగా బదులు ఇస్తారని వివరించారు. ఇందులో కొత్తగా గంటావధాన ప్రక్రియ ఉంటుందని, ప్రాశ్నికుడు గంట వాయించి పద్యాన్ని వివరించమని కోరుతారని తెలిపారు. కార్యక్రమంలో అవధానులు సుసరాపు చంద్రశేఖర శర్మ, రంప సాయికుమార్‌శర్మ, పులఖండం శ్రీనివాసరావు, బి.కోమలరావు, ఎం.వెంకటరమణ, పి.శాంతమ్మ, ఎస్.నారాయణమూర్తి, వి.వి.నాగేంద్ర, ఎన్.నర్సింహమూర్తి, ఎం.శ్రీనివాసరావు, పి.వి.ఎస్.సాయిప్రసాద్, మందిరం కార్యదర్శి కామేశ్వరరావు, సీహెచ్.బాబూరావు, ఈశ్వరరావు, పతంజలి శాస్త్రి, దుర్గారావు, ఎం.మోహనరావు, కె.విజయకుమార్, ఆర్.ప్రసాదరావు, సరస్వతి, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.


అవధాన ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

ఆ నేత్రాలు సజీవం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని చిన్నబజారు నీలమ్మతల్లి ఆలయం సమీపంలో నివాసముంటున్న పట్నాల వెంకటరాజు(60) అనారోగ్య కారణంతో మృతి చెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యుల అనుమతి మేరకు ఆదివారం సేకరించినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. రెడ్‌క్రాస్ మగటపల్లి కల్యాణ నేత్రసేకరణ కేంద్రం సిబ్బంది వెళ్లి కార్నియాను సేకరించారని చెప్పారు. ప్రతిఒక్కరూ నేత్రదానానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలొ నేత్ర సాంకేతిక నిపుణులు సుజాత, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేలా వ్యవహరిస్తున్న స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తీరు మార్చుకోవాలని ఏపీ రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు కొప్పల భానుమూర్తి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఎఫ్ఏపీటీవో-ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా విస్తృత స్థాయి సదస్సు నిర్వహించారు. ఫ్యాప్టో అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కె.భానుమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ సిలబస్‌ను ఇష్టం వచ్చినట్టు మార్చడం సరికాదన్నారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మదన్మోహన్ మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ సెలవు రోజుల్లో, అర్ధరాత్రి వేళ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఉపాధ్యాయుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదన్నారు. ఉపాధ్యాయుల కామన్ సీనియారిటీ సమస్య పరిష్కరించకుండా ఉపాధ్యాయులను గందరగోళపరిచే విధంగా ప్రమోషన్లు కల్పించడం సరికాదని మండిపడ్డారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ కొమ్ము అప్పలరాజు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ, ఫ్యాప్టో కో చైర్మన్ పొందూరు అప్పారావు, రెడ్డి మోహన్‌రావు, పేకేటి రామారావు, బల్ల సుభాష్‌బాబు, సంపతిరావు కిషోర్‌కుమార్, ఏపీ సీపీఎస్ఈఏ ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, కోత ధర్మారావు, బి.రవి, వెంకటరమణ, ఉమాశంకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీ రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు కొప్పల భానుమూర్తి

ఆదిత్యుని సన్నిధిలో భక్తుల రద్దీ


సూర్యనమస్కారాల పూజలు జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంతరాలయంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక అలంకరణలో స్వామిని సర్వదర్శనాలకు అనుమతించారు. ఎప్పటిలాగానే ఈశాన్య ద్వారం నుంచే భక్తులకు ప్రత్యేక, విశిష్ట, ఉచిత దర్శనాలకు అనుమతి ఇవ్వగా భక్తులు ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు. ఆలయం తరపున ఉచిత ప్రసాదాన్ని, మంచినీరు పంపిణీ చేశారు. ఎస్పీ జీఆర్ రాధిక కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకోగా విశాఖపట్టణం సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి కూడా కుటుంబ సభ్యులతో ఆదిత్యుని దర్శించుకున్నారు. అలాగే తాజా సివిల్స్ ర్యాంకర్ చల్లా కల్యాణి కూడా తొలిసారిగా స్వామిని దర్శించుకున్నారు. వీరివెంట 1వ పట్టణ సీఐ ఎల్ఎస్ నాయుడు, చల్లా అసిరినాయుడు, కట్టా వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు. ఇక ఈ ఒక్కరోజున వివిధ దర్శనాల రూపంలో రూ.3, 58, 200, విరాళాల రూపంలో రూ.1, 23, 933, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.40లక్షలు మేరకు ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలియజేశారు.





బతుకుల్లో అలజడి


కవిటి:శోకసంద్రంలో సీహెచ్ కపాసుకుద్ది తీరంలో బడే ఢిల్లేశు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

సిక్కోలు తీరం శోకసంద్రమైంది. రోజూ చూసే సముద్రమే గానీ ఆదివారం వేకువన మాత్రం వింతగా ప్రవర్తించింది. ముఖ్యంగా బందరువానిపేట, సీహెచ్ కపాసుకుద్ది తీరాల్లో రాకాసి అలలు విరుచుకుపడ్డాయి. ఈ కెరటాల ధాటికి ఏకంగా ఆరు పడవలు బోల్తా పడ్డాయి. అందులో వేకువజామున జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా.. మరొకరు గల్లంతయ్యారు. ఇంకొందరు గాయాలతో బయటపడ్డారు. బతుకునిచ్చిన కడలిలోనే ఉసురు పోవడంతో మత్స్యకారుల కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

– గార, కవిటి

బందరువానిపేట తీరంలో..


గార: మృతి చెందిన పుక్కళ్ల లక్ష్మయ్య


గార: గల్లంతైన గుంటు గణపతి (ఫైల్)

గార మండలం బందరువానిపేట తీరం ఆదివారం మత్స్యకారులను వణికించింది. వేకువ నుంచి మధ్యాహ్నం వరకు ఇక్కడ రాకాసి అలలు గంగపుత్రులను భయపెట్టాయి. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వేకువ జామున సిడిపిల్లి సూరిబాబుకు చెందిన పడవలో ఆరుగురు మత్స్యకారులు వేటకు బయల్దేరారు. సాధారణంగా జూన్ నెలాఖరు నుంచి సముద్రం అల్లకల్లోలంగానే ఉంటుంది. మత్స్యకారులకు కూడా ఈ విషయం తెలుసు. కానీ వేకువన చీకటిలో వచ్చిన పెద్ద అల ఒకటి ఈ పడవను ముంచేసింది. దీంతో పడవలో ఉన్న పుక్కళ్ల లక్ష్మయ్య(54), గుంటు గణపతి(50) గల్లంతైపోయారు. మిగిలిన నలుగురు సిరిపిల్లి సూర్యనారాయణ, గుంటు తులసి, దుమ్ము కన్నయ్య, మరో మత్స్యకారుడు ఎలాగోలా బయటపడ్డారు. ఈ పడవ తెల్లారేసరికి పోలాకి మండలం రాజారాంపురం తీరానికి కొట్టుకుని వచ్చింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న తహసీల్దార్ జెన్ని రామారావు, ఎస్‌ఐ ఎన్. కామేశ్వరరావు, ఫిషరీస్ అసిస్టెంట్ హేమంత్ కుమార్, మెరైన్ పోలీసులు గ్రామానికి చేరుకొని గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఆఖరుకు పుక్కళ్ల లక్ష్మయ్య మృతదేహం సంతబొమ్మాళి మండలం చెరువుగట్టుపేట, పిట్టవానిపేట తీరాల మధ్య ఒడ్డుకు చేరింది. గణపతి ఆచూకీ ఇంకా లభించలేదు. పుక్కళ్ల లక్ష్మయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గణపతికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

అంతా చూస్తుండగానే..

వేకువజామున జరిగిన ప్రమాదంతో బందరువానిపేట తీరంలో మత్స్యకారులు, అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ తీరం నుంచి రోజూ 50 నుంచి 70 పడవలు వెళ్తుంటాయి. దాదాపు 400 మంది వేటకు వెళ్తారు. ఉదయం నాలుగింటికే ఓ ప్రమాదం జరగడంతో.. సముద్రం లోపలకు వేటకు వెళ్లిన వారు సురక్షితంగా ఒడ్డుకు రావాలని వారి కుటుంబ సభ్యులు, అధికారులు ఉదయం తీరానికి చేరుకున్నారు. పది గంటల సమయంలో బోట్లు తిరుగుముఖం పడడంతా అంతా తీరం వైపే చూడసాగారు. వారి అనుమానం నిజమై నాలుగు పడవలు ఒడ్డుకు చేరువలో బోల్తా పడ్డాయి. 24 మంది మత్స్యకారులు అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అక్కడే ఉన్న తహసీల్దార్ జెన్ని రామారావు వెంటనే అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారితో మాట్లాడి యుద్ధప్రాతిపదికన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించడంతో పాటు రెండు 108 వాహనాలను ఉంచారు. గాయాలైన మత్స్యకారులకు చికిత్స అందించారు.

కపాసుకుద్దిలో..


కవిటి: బడే ఢిల్లేశు(ఫైల్)

చిన్ననాటి నుంచి అలవాటైన పడవ ఆయన ప్రాణాలను కాపాడలేకపోయింది. ఊహ తెలిసినప్పటి నుంచి ఉపాధి చూపించిన సముద్రం ఆ మత్స్యకారుడి ఉసురు తీసింది. ఆదివారం వేకువజామున సీహెచ్ కపాసుకుద్ది తీరం నుంచి అదే గ్రామానికి చెందిన బడే ఢిల్లేశు(40) మరో నలుగురితో కలిసి చేపల వేటకు బయల్దేరాడు. కొంత దూరం వెళ్లాక అలల ఉద్ధృతి బాగా పెరిగింది. దీంతో మర పడవలో ఉన్న ఢిల్లేశు కింద పడి బోటు అడుగు భాగానికి వెళ్లిపోయాడు. బయటకు వచ్చేందుకు ఎంతగా ప్రయత్నించినా రాలేకపోయాడని తోటి మత్స్యకారులు చెప్పారు. మృతుడికి భార్య తిరుపతమ్మ, కుమారుడు బాలు, కుమార్తె అంజలి ఉన్నారు. ఇంటి యజమాని మరణవార్త విని వారు తల్లడిల్లిపోయారు. కవిటి హెచ్‌సీ రూప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామన్నారు.


గార: బందరువానిపేటలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం


గార: రాజారాంపురం తీరంలో ఒడ్డుకు కొట్టుకు వచ్చిన పడవ

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- మూడు తులాల బంగారం రికవరీ

కంచిలి: చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల్ని కంచిలి పోలీసులు అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు సోంపేట సీఐ ఆర్.రవిప్రసాద్, కంచిలి ఎస్‌ఐ ఎస్.బాలరాజుతో కలిసి కంచిలి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిషా రాష్ట్రం గంజాం జిల్లా దేబభూమి గ్రామానికి చెందిన గణేష్ దాస్, సురడా జిల్లా కాయితాపల్లికి చెందిన శంకర్ పాత్రలను అంపురం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. 2022 అక్టోబర్ 12న కంచిలికి చెందిన సాహుకారి వనిత తన ఇద్దరు పిల్లల్ని జె.ఎం.జె.పాఠశాలలో విడిచిపెట్టి తిరిగి ఇంటికి వస్తుండగా గణేష్‌దాస్, శంకర్‌పాత్రలు పావు తక్కువ రెండు తులాలు బంగారు పుస్తెలతాడును తెంచుకుపోయారు. అదేవిధంగా, ఇచ్ఛాపురం పట్టణ పరిధిలో 2022 సెప్టెంబర్ 1న యాదం రాధిక అనే మహిళ నుంచి ఒకటింపావు తులం బంగారు గొలుసును తెంచుకుపోయారు. ఈ రెండు దొంగతనాలు తామే చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వీరి నుంచి చోరీ సొత్తు 3 తులాలను రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబర్చిన కంచిలి ఎస్‌ఐ ఎస్.బాలరాజును డీఎస్పీ అభినందించారు. హెడ్‌కానిస్టేబుల్ కె.ఈశ్వరరావు, కానిస్టేబుళ్లు ఎన్.చంద్రయ్య, ప్రసాద్, భుజంగరావు, మాధవరావులకు రివార్డులు అందించారు.


వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వర రెడ్డి

చికిత్స పొందుతూ యువకుడి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని రిమ్స్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు ఆదివారం మృతి చెందినట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. సాయిబుల కాలనీకి చెందిన ఆర్.సత్యనారాయణ విద్యుత్తుశాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు కుమారుడు భాస్కర్ కన్నమరాజు (23), ఓ కుమార్తె ఉన్నారు. భాస్కర్ పంజాబ్‌లోని ఎల్‌పీయూ యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతూ ఆరోగ్యం బాగోలేనందున 2023 జనవరిలో వచ్చేశాడు. విశాఖపట్నంలో అప్పుడప్పుడూ వైద్య పరీక్షలు చేసుకుండేవాడు. ఇంటివద్దే ఉంటూ మూడు నెలలుగా శాంతినగర్ కాలనీలో డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ చేస్తూ.. అక్కడికి వచ్చువారికి స్విమ్మింగ్ నేర్పించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 8న స్విమ్మింగ్ చేస్తుండగా నీటిలోనే మూర్ఛరోగం రావడంతో మునిగిపోయాడు. అక్కడఉండేవారు బయటకు తీసి రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.